క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

సింహాచలంలో ఘనంగా నిత్యాన్నదాన వార్షికోత్సవం



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న అధికారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకం వార్షికోత్సవం గురువారం సింహగిరిపై వైభవంగా నిర్వహించారు. ఈ పథకం 36 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవస్థానం అధికారులు ఈ వేడుకలను నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు నిత్యం అందించే అన్నప్రసాదాలతో పాటు, ప్రత్యేకంగా తయారు చేసిన చక్కెరపొంగలి, బూరెలు, పులిహోర అందజేశారు. అన్నప్రసాద భవనంలో సింహాద్రినాథుని చిత్రపటం వద్ద దేవస్థానం ఏఈవోలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు, సీనియర్ అసిస్టెంట్ రేవతి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ అయిత సింహాచలం

పెందుర్తి : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా పులగానిపాలెంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను పీఏసీఎస్ చైర్మన్ అయిత సింహాచలం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.8 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కృష్ణాష్టమి రోజు బహుమతుల ప్రధానం చేస్తామని వెల్లడించారు. స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నెరవేరని కల



రైలు పట్టాలు దాటుతున్న కార్మికులు



లంకెలపాలెం రైల్వే గేటు దాటుతున్న ప్రయాణికులు

- ఏళ్లు గడుస్తున్నా సాకారంకాని లంకెలపాలెం అండర్ బ్రిడ్జి
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రైలు పట్టాలు దాటుతున్న స్థానికులు
- రాకపోకలకు గ్రామస్తులు, ఫార్మాసిటీ ఉద్యోగులకు తీవ్ర అవస్థలు



రైల్వే ట్రాక్ అవతల ఉన్న లంకెలపాలెం గ్రామం

పరవాడ : లంకెలపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కలగా మిగలడంతో గ్రామస్తులు, ఫార్మాసిటీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రోజు కూలీలు, కర్షకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం రైల్వే గేటు వద్ద భారీ వంతెన నిర్మించారు. దీంతో రైల్వే గేటు పూర్తిగా మూసివేశారు. అప్పటి నుంచి రైలు పట్టాలకు అవతల వైపు ఉన్న లంకెలపాలెం గ్రామస్తులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. రైల్వే గేటుకు ఇవతల వైపు ఉన్న దుకాణాలు, పిల్లల చదువులకు అవసరమైన పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకు శాఖలు, పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి అవసరమైన బస్టాప్‌లకు వెళ్లాలంటే లంకెలపాలెం కూడలికి రావాల్సిందే. అలాగే పట్టణ ప్రాంతాల్లో కూలీనాలీ చేసుకుని జీవనం సాగిస్తున్న రోజు వారీ కూలీలు లంకెలపాలెం కూడలికి చేరుకోవాలంటే రెండు కిలోమీటర్లు దూరం కాలినడకన తిరిగి వంతెన పైనుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రైలు పట్టాలు దాటుకొని కూడలికి చేరుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పాఠశాలలకు తమ పిల్లలను చేర్చే బస్సులు కూడా రద్దీగా ఉండే వంతెన మీదుగా వెళ్లడం వల్ల ఒక్కొక్కసారి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో నిర్ణీత సమయాలకు పాఠశాలలకు చేరుకోలేకపోతున్నారు.

బిక్కుబిక్కుమంటూ రాకపోకలు

రోజూ ఉదయం 9 గంటల నుంచి ఫార్మాసిటీలోని పరిశ్రమలకు విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికుల వాహనాలు, బొగ్గు, బూడిద లారీలతో వంతెన రోడ్డు రద్దీగా మారుతుంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా రైలు పట్టాల అవతల వైపు నివసిస్తున్న ప్రజలు గ్రామానికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో ఎటు నుంచి ఏ రైలు వస్తుందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే అత్యవసరంగా ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ట్రాక్ వద్ద నిర్మించిన వంతెన ఫలితంగా వ్యయ ప్రయాసలతోపాటు ప్రమాదాలకూ గురవుతున్నామని వాపోతున్నారు.

మొర వినేవారే లేక...

తమ కష్టాలను గుర్తించి రైలు పట్టాలు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కొన్నేళ్ల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నారు. కానీ వీరి మొర వినే నాథుడే కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వమైనా లంకెలపాలెం రైల్వే ట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించి తమ కష్టాలు తీరుస్తుందన్న ఆశతో వినతులు అందజేస్తూనే ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అవసరమైన స్థలాన్ని పరిశీలించడంతో తమ కల నెరవేరుతుందేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి



రైల్వే గేటు అవతల నివసిస్తున్న ప్రజలు అనారోగ్యం బారిన పడితే సకాలంలో వైద్య సేవలు అందక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రోగిని అత్యవసరంగా ఆస్పత్రికి చేర్చాల్సిన అంబులెన్స్‌కు వంతెనపై ట్రాఫిక్ సమస్యలు అడ్డంకిగా మారుతున్నాయి. రైలు పట్టాలు దాటుకుని రోగిని ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే ఎటు నుంచి ఏ ట్రైన్ వస్తుందో తెలీదు. ఇంతలో రోగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు గ్రామంలో అనేకం జరిగాయి. అండర్ బ్రిడ్జి నిర్మించడం ద్వారా సమస్య పరిష్కారమవుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కరణం అప్పలరాజు, లంకెలపాలెం

భయం భయంగా చేరుకుంటున్నాం



కూలీనాలీ చేసుకుని వంతెన అవతల వైపు ఉన్న తమ గ్రామానికి చేరుకోవాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలినడకన రైలు పట్టాలను దాటుకొని ఇళ్లకు చేరుకోవాల్సి వస్తోంది. నిత్యం భయం భయంగా బతుకుతున్నాం. రైల్వే ట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు మా గ్రామ నాయకులు అనేక వినతులు చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి స్థల పరిశీలన చేసి వెళ్తున్నారే తప్ప అండర్ బ్రిడ్జి నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చలేదు. అండర్ బ్రిడ్జి కోసం అందరం వేయికళ్లతో ఎదురు చూస్తున్నాం.

– పూర్ణచంద్, లంకెలపాలెం

రైల్వే భూ సేకరణపై అభ్యంతరాల స్వీకరణ



అభ్యంతరాలు వింటున్న ఆర్డీవో శ్రీలేఖ

పెందుర్తి: సింహచలం–కొత్తవలస లైన్ పార్లుపాలెం, చింతలగ్రహారం వద్ద నూతనంగా నిర్మించనున్న ఫ్లై ఓవర్, అదనపు రైల్వే ట్రాక్ నిర్మాణంలో భూసేకరణకు సంబంధించి పెందుర్తి రెవెన్యూ పరిధిలోని చీమలాపల్లి నిర్వాసితులు, రైతులు, హక్కుదారుల నుంచి అభ్యంతరాలు సేకరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో శ్రీలేఖ మాట్లాడుతూ భూ సేకరణ అత్యంత పారదర్శకంగా జరుగుతుందన్నారు. రైల్వే సేకరించనున్న భూముల విషయంలో సింహచలం దేవస్థానం, రెవెన్యూ, జిరాయితీ భూముల్లో ఉన్న రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం తగిన పరిహారం అందిస్తుందన్నారు. స్థానిక పరిస్థితి, రికార్డులను బట్టి మాత్రమే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కేవలం అవార్డు (పరిహారం) విషయం మాత్రమే మాట్లాడాలని.. అదనపు పరిహారం విషయంలో ఎవరూ ఆలోచించాల్సిన అవసరం కూడా లేదని తేల్చిచెప్పారు. తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు, డీటీ జి.కిషోర్, ఆర్ఐ హరి ప్రసూన, మండల సర్వేయర్ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న గురుకుల పాఠశాల విద్యార్థులు,అధ్యాపకులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గురుకుల పాఠశాల నుంచి సబ్బవరం మూడు రోడ్ల కూడలి వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె. చిరంజీవిరావు, పీడీ పి.ఎల్.ఎన్. ప్రసాద్, పీఈటీ పి. సూర్యనారాయణతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పెందుర్తిలో 'హర్ ఘర్ తిరంగా'

పెందుర్తి : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో పెందుర్తి పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ గురువారం చేపట్టారు. విద్యార్థులు త్రివర్ణ పతాకాలను చేతబూని 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు, పలు కళాశాలల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో విద్యార్థులు, నాయకులు

తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఉక్కునగరం: ఇటీవల స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగించిన 1,541 మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మే 20 నుంచి మే 29 వరకు కార్మికులు తమ ఉద్యోగాల రక్షణ కోసం సమ్మె చేశారని, అయితే యాజమాన్యం కక్షపూరితంగా సమ్మెలో పాల్గొన్నారనే నెపంతో 1,541 మంది కార్మికుల గేట్ పాస్‌లను రద్దు చేసి, వారిని విధుల్లోకి రానివ్వడం లేదని గంగరావు ఆరోపించారు. అంతేకాకుండా వారి స్థానంలో కొత్తవారిని విధుల్లోకి తీసుకుంటున్నారని తెలిపారు. ఆర్.ఎల్.సి. సమక్షంలో జరిగిన చర్చల్లో ఎవరినీ తొలగించబోమని యాజమాన్యం హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీని ఉల్లంఘించిందన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

సీఎంఆర్ఎఫ్ చెక్‌లు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి : నియోజకవర్గంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం అందజేశారు. సుజాతనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 19 మందికి రూ.13.65 లక్షల విలువైన చెక్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన స్త్రీ శక్తి పథకం ద్వారా శుక్రవారం నుంచి మహిళలు ఫొటో ఐడీ ప్రూఫ్ చూపించి ఉచితంగా ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించొచ్చని సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న క్రికెటర్లు



అప్పన్న ఆలయంలో ఏపీఎల్ సింహాద్రి వైజాగ్ లయన్స్ క్రికెట్ టీమ్

సింహచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని గురువారం ఏపీఎల్ సింహాద్రి వైజాగ్ లయన్స్ క్రికెట్ టీమ్ దర్శించుకుంది. ఆలయంలోని కప్ప స్తంభాన్ని టీం సభ్యులు ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందజేశారు.

హయ్యర్ పెన్షన్ అందించడంపై హర్షం



బీచ్‌రోడ్డులో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

ఏయూ క్యాంపస్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అందించడంపై కృతజ్ఞతలు తెలుపుతూ స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌కే బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఎంపీ శ్రీభరత్, నేషనల్ ఆఫీసర్స్ అధ్యక్షులను సత్కరించారు. హయ్యర్ పెన్షన్ అందని వారికి సైతం లభించే విధంగా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రరావు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఏటీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, బోసు బాబు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సహకారంతో నిర్వహించనున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ (ఏక్యూవీహెచ్) 2025లో భాగంగా నిర్వహించే విశ్వవిద్యాలయ స్థాయి పోటీల పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌ను సెప్టెంబర్ 13న నిర్వహించనుంది. ఇందుకు సన్నాహకంగా విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఏయూ పరిధిలోని కళాశాల విద్యార్థులకు ఆగస్టు 28న హ్యాకథాన్ నిర్వహిస్తారు. విశ్వవిద్యాలయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హ్యాకథాన్ కన్వీనర్ ఆచార్య డి.లలిత భాస్కరి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట్రావు, ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు, డీన్ ఆచార్య కె.రమాసుధ పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

గాజువాక : శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఈనెల 19 నుంచి 26 వరకు వివిధ పోటీలను నిర్వహించనున్నట్టు ఆ సంస్థ డీజీఎం కె.బంగార్రాజు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకర్రావు జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఈ పోటీలను నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆఫ్టోఫేర్, పాటలు, శ్లోక పారాయణం, గాజు పెయింటింగ్, ఇమాజినరీ స్టోరీ టెల్లింగ్, రోల్ ప్లే, డ్రాయింగ్ తదితర అంశాలపై ఈ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ఈనెల 18లోగా ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

వెల్డింగ్ షాపులు, రెస్టారెంట్ల తనిఖీ

తగరపువలస: ఆనందపురం, భీమిలి మండలాలలోని పలు వెల్డింగ్ షాపులు, రెస్టారెంట్లను భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ గురువారం తనిఖీ చేశారు. ఇటీవల నగరంలోని ఫిషింగ్ హార్బర్ వద్ద వెల్డింగ్ షాపులో జరిగిన పేలుళ్ల దృష్ట్యా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. రెస్టారెంట్లు, వెల్డింగ్ షాపులలో కమర్షియల్ సిలిండర్లు కాకుండా వంట గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేసి యజమానులపై 6ఏ కేసులు నమోదు చేశారు. భవిష్యత్తులో వ్యాపార అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ శ్రీనివాసరావు, తాళ్లవలస అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరాజు, రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.